క్లుప్తంగా

ఘనంగా త్రిమాత ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్లు ముమ్మన దేముడు, పీలా శ్రీనివాసరావు

పెందుర్తి: మండలంలోని చింతలగ్రహారం త్రిమాత ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బండిమాంబ, మెట్ట మాంబ, దుర్గమ్మలకు భక్తులకు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు-కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్లు ముమ్మన దేముడు, పీలా శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

ఆదిత్యునికి అభిషేకాలు



పూజలందుకున్న సూర్యనారాయణస్వామి

పెందుర్తి: సుజాత నగర్‌లోని సూర్య నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారుతి ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సుజాతనగర్ 30 వసంతాల వేడుక



కార్యక్రమంలో పాల్గొన్న సుజాతనగర్ అప్‌కీప్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

పెందుర్తి: సుజాతనగర్ అప్‌కీప్ వెల్ఫేర్ అసోసియేషన్ 30వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాలనీ వాసులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కాలనీ అభివృద్ధిపై కమిటీ ప్రతినిధులు చర్చించి కార్యాచరణ రూపొందించారు. వేడుకల్లో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కె.లోకనాథరావు, ఎన్.బాలకృష్ణరావు, జి.వి. రమణమూర్తి, డి.వి.ఎస్.ఎన్ మూర్తిరాజు, జి.ధనరాజు, పి.ఎస్.ఆర్ మూర్తి, బి.రామ్మోహనరావు, ఎస్.జ్యోతేశ్వరరావు, ఎ.వెంకటరావు, ఎస్.సాహు, పి.వి.ఎన్ రాజు, పి.భాస్కరరావు, వి.ఎస్.ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా ఓటర్లకు అవగాహన



అప్పన్నపాలెంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలు

పెందుర్తి: జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పెందుర్తి నియోజకవర్గంలో ఆదివారం 'మన పోలింగ్ బూత్-మన ఓటు' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆర్వో పి.శేష శైలజ ఆధ్వర్యంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ, జీవీఎంసీ పరిధిలోని పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

సబ్బవరం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం మన పోలింగ్ బూతు-మన ఓటు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 68 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు ఓటర్లు తమ పేర్లు జాబితాలో ఉందో లేదో సరిచూసుకున్నారు. సబ్బవరం పోలింగ్ స్టేషన్లు 34,36,37 సెక్టార్ అధికారులు పి. విజయలక్ష్మి,హిమబిందు పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని కోరారు.

కలపాక..
అభివృద్ధి పతాక



కలపాక గ్రామ సచివాలయం



జగనన్న కాలనీ ఇళ్ల సముదాయం



కలపాక-దలాయిపాలెం గ్రామాల మధ్య నిర్మించిన సీసీ రహదారి

- రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల కింద రూ. 29.41 కోట్ల నగదు జమ
- మా పల్లె మారిందని సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

పరవాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కలపాక గ్రామం రూపురేఖలు మారిపోయాయి. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సహకారంతో గ్రామ సర్పంచ్ బొండా కనకారావు గ్రామ పంచాయతీలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. ప్రజలకు అవసరాలు తీర్చారు. కలపాక గ్రామంలో వివిధ పథకాల ద్వారా రూ.29.41 కోట్ల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరాయి.

మారు మూలనున్న కలపాక గ్రామం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంది. అనేక ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కారమయ్యాయి. నిరుపేదలకు పక్కా ఇళ్లను మంజూరు చేసి వారి సొంతింటి కలను ప్రభుత్వం నిజం చేసింది. అనేక మంది వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు నూతన పింఛన్లు మంజూరు చేసి వారికి భరోసా కల్పించింది. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించడానికి లక్షలాది రూపాయలు వెచ్చించి గ్రామ సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించింది.

పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన నిధులు

- రూ.35 లక్షలతో గ్రామ సచివాలయ భవనం నిర్మాణం
- రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనం
- రూ.17.50 లక్షలతో వెల్‌నెస్ సెంటర్
- ఎంపీపీ పాఠశాల భవనం అభివృద్ధికి ఎన్టీపీసీ నిధులు రూ.12 లక్షలు
- మరిశవానిపాలెంలో రూ.10 లక్షలు వెచ్చించి రెండు సీసీ రోడ్ల నిర్మాణం
- కలపాక-ఎన్టీపీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు

పథకం	లబ్ధిదారులు	జమ అయిన సొమ్ము	పథకం	లబ్ధిదారులు	జమ అయిన సొమ్ము
అమ్మ ఒడి	430	రూ.1.98.85, 455	వైఎస్సార్ కాపు నేస్తం	08	రూ.3,60,000
జగనన్న విద్యా దీవెన	375	రూ.1.17.86, 131	వైఎస్సార్ ఈబీసీ నేస్తం	07	రూ.1,95,000
జగనన్న వసతి దీవెన	293	రూ.40.70, 831	వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	145	రూ. 61,83,738
రైతు భరోసా	626	రూ.2.87.81,160	వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	84	రూ.6,44,000
వైఎస్సార్ పంటల బీమా	05	రూ.1.43,574	జగనన్న హౌసింగ్	128	రూ. 1.39,43,762
వైఎస్సార్ ఇన్‌పుట్ సబ్సిడీ	60	రూ.2.17,198	వైఎస్సార్ బీమా	15	రూ.25,40,000
వైఎస్సార్ పెన్షన్ కానుక	676	రూ.6.42,53,000	వైఎస్సార్ వాహన మిత్ర	53	రూ.15,20,000
వైఎస్సార్ చేయూత	343	రూ.1.60,50,000	జగనన్న చేదోడు	24	రూ.5,40,000
వైఎస్సార్ ఆసరా	1006	రూ.4,49,09,003	కోవిడ్ సహాయం	1225	రూ.12,25,000
వైఎస్సార్ సున్నా వడ్డీ	1127	రూ. 28,13,911	జగనన్న తోడు	130	రూ. 65,737

జగనన్న ఎంతో మేలు చేశాడు



మాది కలపాక గ్రామం. జగనన్న అధికారంలో రాగానే నాకు వైఎస్సార్ చేయూత రూ.18,750 మంజూరు చేశారు. వైఎస్సార్ రుణ మాఫీ వంటి సంక్షేమ పథకాలు పొందాను. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలి. జగనన్న మేలును జీవితంలో మరచిపోను.

– ఈరుగుల గంగమ్మ, కలపాక

సంతోషంగా ఉంది



ఇప్పటి వరకు అద్దె ఇంట్లో నివశించేవారం. జగనన్న అధికారంలో రాగానే మాకు సొంతిల్లు మంజూరు చేశారు. స్థలం ఇచ్చారు. రూ.1.80 లక్షలు మంజూరు చేశారు. ఆ డబ్బుతో కొంత అప్పు చేసి సొంతిల్లు కట్టుకున్నాం. దీంతో సొంతింటి కల నెరవేరింది. చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు నా కుటుంబం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– కొత్తపల్లి చిన్ని, కలపాక

గ్రామాన్ని అభివృద్ధి చేశాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో గ్రామం రూపు రేఖలు మారిపోయాయి. ప్రజలకు ఏ పని కావాలన్నా అందుబాటులో ఉన్న సచివాలయానికి వెళ్లి సేవలు పొందుతున్నారు. తాగునీటి సమస్యలు, సీసీ రోడ్ల నిర్మాణం, పేదలకు పక్కా ఇళ్లు, అవ్వా తాతలకు పింఛన్లు మంజూరు చేయడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధితో పాటు సంక్షేమంలో మా పంచాయతీ ముందంజలో ఉంది. మళ్లీ జగనన్నే సీఎం కావాలని మేమంతా కోరుకొంటున్నాం.

– బొండా కనకారావు, సర్పంచ్, కలపాక

బూడికి అభినందనలు



బూడి ముత్యాలనాయుడును సత్కరిస్తున్న మండల సముద్రం తదితరులు

సబ్బవరం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును సబ్బవరం మేజర్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా ఆయనను ప్రకటించడంతో తారువలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు.సబ్బవరం మాజీ సర్పంచ్ మండల సముద్రం, అనకాపల్లి మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ గొంప దేముడు తదితరులు ఆయన్ను సత్కరించి తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. అలాగే మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధకు కూడా అభినందనలు తెలిపారు.

కార్యక్రమంలో ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, పార్టీ జిల్లా మహిళా విభాగం కార్యదర్శి దెడ్డం పద్మావతి,పార్టీ సీనియర్ నాయకులు టి. శేఖర్,సబ్బవరపు నాగభూషణం,దనిమిరెడ్డి శ్రీను,కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ వీధిలో మన పోలింగ్ బూత్ - మన ఓటు



పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమం నిర్వహిస్తున్న బీఎల్‌వో

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు మోదీ వీధిలో ఆదివారం మన పోలింగ్ బూత్- మన ఓటు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు విలువ, ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలో బీఎల్‌వో ఆరిపాక శ్రీనివాస్‌కుమార్ నివాసితులకు వివరించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలని సూచించారు. పోలింగ్ తేదీ, పోలింగ్ బూత్ వివరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోదీ వీధి అధ్యక్షుడు భూపతిరాజు సూరపరాజు పాల్గొన్నారు.

గరుడ వాహనంపై సింహాచలేశుడు



గరుడవాహనంపై అప్పన్న తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు



నృత్య కళాకారులతో దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి

- వైభవంగా తిరువీధి
- పరవశించిన భక్తజనం

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం స్వామికి గరుడ వాహనంపై తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి గరుడ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని ఘనంగా నిర్వహించారు. గరుడ వాహనంపై ఆశీనుడైన స్వామిని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. నృత్య కళాకారులు స్వామికి స్వాగతం పలికారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యాహక్కు చట్టం అమలుతో బాలలకు భరోసా



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: విద్యా హక్కు చట్టం ప్రకారం ఆరు నుంచి 14 ఏళ్ల బాలలకు ప్రభుత్వం ఉచిత విద్య అందించాల్సి ఉందని ఏపీ రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం కన్వీనర్ నరవ ప్రకాశరావు అన్నారు. విద్యా హక్కు చట్టం ప్రవేశపెట్టి 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం ద్వారా బాలలకు భరోసా ఇవ్వాలన్నారు. చట్టం అమలు తీరుపై శ్వేతపత్రం విడుదల చేయాలని, రాష్ట్రంలో సున్నా నుంచి 18 ఏళ్ల వయసు గల బాలలందరినీ చట్ట పరిధిలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో వక్తలు పి.కె.జోషి, రమాదేవి, గౌరీశంకర్, మణి, హరగోపాల్, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి జనసేన కార్యకర్తలు

అప్పికొండ ప్రాంతం నుంచి దాదాపు 100 మంది చేరిక



ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సమక్షంలో పార్టీలో చేరిన జనసేన కార్యకర్తలు, చిత్రంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి

పెందుర్తి: జీవీఎంసీ 77వ వార్డులో జనసేనకు షాక్ తగిలింది. వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఆధ్వర్యంలో దాదాపు 100 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం వేపగుంట సమీపంలోని మీనాక్షి కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పార్టీ కండువాలు కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని అదీప్‌రాజ్ ఈ సందర్భంగా చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గండి రవికుమార్, కొవిరి శివకుమార్, ఎంపీ రెడ్డి, కమల్ హాసన్, సోమునాయుడు, అర్జిలి కొండలరావు, మట్ట కొండయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు అపార్ట్‌మెంట్ వాసుల మద్దతు



పెందుర్తి యధువంశీ అయాతం అపార్ట్‌మెంట్ ప్రతినిధులతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: పెందుర్తిలోని యధువంశీ అయాతం అపార్ట్‌మెంట్ ప్రతినిధులు రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను కలిశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నేత గండి రవికుమార్, అసోసియేషన్ ప్రతినిధులు జగన్, సూర్యప్రకాష్, శ్రీను, చంద్రమౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ, జనసేన నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని చాకిరేవుకొండ ప్రాంతానికి చెందిన 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు.

పార్టీలో చేరిన వాళ్లలో టీడీపీ నుంచి 60మంది, జనసేన నుంచి 40 మంది ఉన్నారు. సీతమ్మధారలోని తన నివాసంలో భీమిలి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మే13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని ముత్తంశెట్టి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వాళ్లలో టీడీపీ నాయకులు సత్తిబాబు, దేవుళ్లు, వాడపల్లి వెంకటరావు, హరిబాబు, జనసేన నుంచి తిరుపతి రెడ్డి, మాకిరెడ్డి, శివ తదితరులు ఉన్నారు. 98వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, పార్టీ నాయకులు లంక సత్తిబాబు, ఎస్.కృష్ణ, ఎన్. అప్పారావు, బోర లక్ష్మణరెడ్డి, సచివాలయ కన్వీనర్ మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందడిగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యంతో ఆకట్టుకున్న విద్యార్థులు

పెందుర్తి: పెందుర్తిలోని యూనిక్ పబ్లిక్ పాఠశాల వార్షికోత్సవాన్ని ఆదివారం సాయంత్రం అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థులు వెస్ట్రన్, సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. వివిధ పోటీల్లో జాతీయ స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్‌కు రూ.10 వేలు, ఆరాధన అనాథ ఆశ్రమానికి రూ.10 వేలు, చింతలగ్రహారంలోని అంధుల పాఠశాలకు రూ.10 వేలు, లక్ష్మీపురంలోని దివ్యాంగుడు శ్రీనుకి రూ.5 వేలు వితరణ చేసి పాఠశాల యాజమాన్యం సేవాభావాన్ని చాటుకుంది. కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ డి.ఉదయ్ కుమార్, విశ్వం ఎడ్యుటెక్ మేనేజర్ జగదీష్, ప్రముఖ నృత్య కళాకారిణి శోభారాణి, కరస్పాండెంట్ కోనేటి ఆదినారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



రోమన్ కేథలిక్ చర్చిలో సందేశం అందిస్తున్న ఫాదర్ పులికల్, కల్యాణ్

సబ్బవరం: మండలంలోని పలు చర్చిల్లో ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి చర్చిల్లో జాగరణ చేసి క్రైస్తవులు భక్తి గీతాలు ఆలపించారు. ఆదివారం తెల్లవారుజామున క్రీస్తు సమాధి నుంచి పునరుత్థానుడై తన తండ్రిని చేరుకున్న సన్నివేశాలను వివరించే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సబ్బవరంలోని రోమన్ కేథలిక్ చర్చిలో ప్యారీస్ ప్రీస్ట్ థామస్ పులికల్,ఫాదర్ కల్యాణ్ ప్రసంగించారు. పుష్ప,ధనుంజయ్, గణేష్ బైబిల్‌ను పఠించారు. రక్షణ కొవ్వొత్తిని ఫాదర్ థామస్ వెలిగించారు. క్రీస్తు పునరుత్థానుడైన విగ్రహాన్ని ఇక్కడి ఫాతిమా మాత చర్చి ఫీస్ట్ థామస్ పులికల్ ఆవిష్కరించారు. సబ్బవరం ప్యారిస్ కౌన్సిల్ సభ్యులు పి. మాణిక్యాలరావు,పీటర్ ఆడారి నాగరాజు,ఎస్. జోసెఫ్,అప్పారావు,చంటి, బ్రిజిటన్ సిస్టర్స్ అలీస,పుష్ప,పునీత,విజయప్రియ,ఫ్లోరా,లీన తదితరులు పాల్గొన్నారు.

'హామీలు నెరవేర్చని మోదీని ఓడిద్దాం'

సీతంపేట: హామీలు అమలు చేయని అబద్ధాల ప్రధాని నరేంద్రమోదీని రానున్న ఎన్నికల్లో ఓడించి ఆటో, మోటార్ రంగాన్ని కాపాడాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు కేలం శివ పిలుపునిచ్చారు. అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద ఆదివారం జరిగిన ఆటో డ్రైవర్ల ధర్నాలో వారు మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికితీసి ప్రతి పేద కుటుంబానికి రూ.15 లక్షలు బ్యాంకులో వేస్తామని హామీ ఇచ్చి పదేళ్లు గడిచినా.. నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో శంకర్, నూకరాజు, జి.నందీశ్వరరావు పాల్గొన్నారు.